# శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఫలితాంశాలు

**కలి గతాబ్ది: 5124, క్రీస్తుశకం: 2023-24, శాలివాహన శకం: 1945,**
**భారత స్వాతంత్ర్య శకం: 76-77**

## నవనాయక ఫలితాలు

ఈ సంవత్సరానికి రాజు-బుధుడు, మంత్రి- శుక్రుడు, సేనాధిపతి-గురువు, సస్యాధిపతి-చంద్రుడు, ధాన్యాధిపతి-శని, అర్ఘ్యాధిపతి-గురువు, మేఘాధిపతి-గురువు, రసాధిపతి-కుజుడు, నీరసాధిపతి-చంద్రుడు, రాజవాహనం-డోలా, పశుపాలకుడు, గోష్ఠాగార ప్రాపకుడు (స్థాన సంరక్షకుడు)-బలరాముడు, గోష్ఠాద్బహిష్కర్త-శ్రీకృష్ణుడు. నవనాయక వర్గంలో శుభుల ఆధిపత్యం ఎక్కువగా ఉండటం మంచిది. ఉపనాయక వర్గంలోనూ శుభగ్రహాల ఆధిపత్యం ఉంది. ఫలితంగా దేశంలోని అన్ని ప్రాంతాల్లో అనుకూల వర్షాలు ఉంటాయి. సువృష్టి వల్ల పంటలు సమృద్ధిగా పండుతాయి. ప్రజల్లో అనుబంధాలు పెరుగుతాయి. సరిహద్దుల్లో ఘర్షణ వాతావరణం కొనసాగుతుంది.

**రాజు- బుధుడు:** రాజు బుధుడు కావడం వల్ల ప్రజలు సుభిక్షంగా ఉంటారు. మంచి వర్షాలు కురిసి పంటలు బాగా పండుతాయి. ఈ సంవత్సరం మూడు తూముల వర్షం, నాలుగు తూముల వాయువు ఉంది. అపర సస్యాలు (కంది, పెసర, మినుము వంటి పప్పు ధాన్యాలు) సమృద్ధిగా పండుతాయి. ఇతర పంటలు కూడా ఓ మోస్తరుగా దిగుబడి సాధిస్తాయి. సృజనాత్మక రంగాల్లో ఉన్నవారికి అవకాశాలు వెల్లువెత్తుతాయి. ఓటీటీ, సినిమా, టీవీ వంటి వినోద రంగాలకు ఆదరణ పెరుగుతుంది. రాజకీయంగా మిశ్రమ ఫలితాలు ఉంటాయి. నెయ్యి, నూనెగింజలు, పల్లీలు, పత్తి, బంగారం, వెండి, ఇత్తడి, కలప, కాగితం, చింతపండు, ఎరువులు, కంచు, ఉల్లిపాయలు, పసుపు, పొగాకు, అరటిపండ్లు, తమలపాకులు, తేయాకు, విస్తరాకులు, పాలు, పెరుగు, మజ్జిగ, వెన్న, చందనం, అగరు వస్తువులు, పెసలు, మినుములు, కందులు, బియ్యం, గోధుమలు, తోళ్లు, బూడిద రంగు వస్తువుల ధరలు, వ్యాపార వాటాలు పెరుగుతాయి.

**రాజవాహనం-ఊయల:** వివిధ దేశాల్లో దుర్భిక్షం ఏర్పడుతుంది. ఆహార ధాన్యాల కొరత పెరుగుతుంది. పలు దేశాల్లో యుద్ధ వాతావరణం నెలకొంటుంది.

**మంత్రి-శుక్రుడు:** పంటలకు ఈతిబాధలు ఉంటాయి. ఎలుకలు, మిడతల దాడి పెరుగుతుంది. బర్రెలకు, ఆవులకు హాని. ధాన్యం ధరలు పెరుగుతాయి. జానపదులకు, గిరిజనులకు భయాలు పెరుగుతాయి. చెరువులు నిండుకుండల్లా తొణికిసలాడుతాయి.

**సేనాధిపతి- గురువు:** ప్రజలు, పాలకులు న్యాయవర్తనులై ఉంటారు. ప్రజాభీష్ట పాలన కొనసాగుతుంది. ప్రజలు సంతోషంగా జీవనం సాగిస్తారు. ప్రజల్లో భక్తి పెరుగుతుంది. ధార్మిక జీవనంపై ఆసక్తి కనబరుస్తారు.

**సస్యాధిపతి- చంద్రుడు:** మత్స్య సంపద పెరుగుతుంది. పాడి రంగం అభివృద్ధి చెందుతుంది. మెట్ట పంటలు బాగా పండుతాయి. చింతపండు, మామిడిపండ్లు, పనస, నారింజ తదితర ఫలాల దిగుబడి బాగుంటుంది. గోధుమలు, జొన్నలు, సజ్జలు, చెరకు, ఉప్పు, తమలపాకులు మొదలైనవాటి ధరలు పెరుగుతాయి.

**ధాన్యాధిపతి- శని:** మినుములు, నువ్వులు, అవిసెలు, ఆవాలు మొదలైనవి సమృద్ధిగా పండుతాయి. నల్లరేగడి నేలలు మంచి దిగుబడినిస్తాయి.

**అర్ఘ్యాధిపతి- గురువు:** వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. ఆధ్యాత్మికత పరిఢవిల్లుతుంది. యజ్ఞయాగాది క్రతువులు విశేషంగా కొనసాగుతాయి. ధార్మిక విషయాల పట్ల పాలకులు ఆసక్తి కనబరుస్తారు.

**మేఘాధిపతి- గురువు:** సస్య సమృద్ధితో ధరలు తగ్గుతాయి. కొన్ని ప్రాంతాల్లో ధరలు పెరుగుతాయి. ప్రజలు రోగ భయం లేకుండా సుఖాలను అనుభవిస్తారు. అన్ని ప్రాంతాల్లో మంచి వర్షాలు ఉంటాయి. వాణిజ్య రంగం అభివృద్ధి పథంలో సాగుతుంది.

**రసాధిపతి- కుజుడు:** జీలకర్ర, ఉప్పు, నెయ్యి, నువ్వుల నూనె, బెల్లం మొదలైన పదార్థాల ధరలు నిలకడగా ఉంటాయి. బంగారం, వెండికి డిమాండ్ పెరుగుతుంది. సారాయి, బ్రాందీ మొదలైన మత్తు పానీయాల ధరలు పెరుగుతాయి.

**నీరసాధిపతి- చంద్రుడు:** బంగారం, వెండి, కంచు మొదలైన లోహాలు, నవరత్నాలు, అలంకరణ వస్తువుల ఉత్పత్తి పెరుగుతుంది. దుస్తుల ధరలు నిలకడగా ఉంటాయి.

**పశుపాలకుడు-బలరాముడు:** పంటలకు అనుకూల వర్షాలు కురుస్తాయి. పంటలు అధిక దిగుబడిని ఇస్తాయి. మధ్య భారతంలో పాడిపంటలు సమృద్ధిగా ఉంటాయి. ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. ధరలు మధ్యమంగా ఉంటాయి.

**గోష్ఠాద్బహి ప్రాపకుడు- శ్రీకృష్ణుడు:** పశుసంపద వృద్ధి చెందుతుంది. పంటల దిగుబడి పెరగడం వల్ల ధరలు నిలకడగా ఉంటాయి. పశుపాలకుడు, స్థాన సంరక్షకుడు బలరాముడు కావడం వల్ల పాడిపంటలు బాగుంటాయి. ప్రజా సంక్షేమం మధ్యమంగా ఉంటుంది.




**గుడి ఉమామహేశ్వర శర్మ సిద్ధాంతి**

**తండ్రి పేరు :** కీ.శే. గుడి నృసింహ సిద్ధాంతి, బ్రహ్మపురి, నిర్మల్, నిర్మల్ జిల్లా, తెలంగాణ

**ప్రస్తుత నివాసం :** ఫ్లాట్ నెం. 103-ఎ, రెండవ అంతస్తు, పి.బి.ఆర్. ఎస్టేట్స్, కూరగాయల మార్కెట్ దగ్గర, నల్లకుంట, హైదరాబాద్ - 500044.

సెల్: 9885096295, 040-27651530.


## పంచాంగ కర్త పరిచయం

**సనాతన** ధర్మానికి, జ్యోతిష్య విద్య, సంస్కృత, వేద శాస్త్రాలకు ఆలవాలమైన గుడి వంశంలో కాశ్యపస గోత్రంలో గుడి నృసింహ సిద్ధాంతి - గోదావరమ్మ దంపతులకు జన్మించారు. జ్యోతిర్విద్యా విశారదులుగా 45 సం॥లు నిరాటంకంగా పంచాంగ రచన గావించిన పితృదేవులైన గుడి నృసింహ సిద్ధాంతి గారి వద్ద జ్యోతిశ్శాస్త్రం, ముహూర్త, సిద్ధాంత (గణిత), జాతక, వాస్తు భాగాలను క్షుణ్ణంగా, సంపూర్ణంగా అభ్యసించారు. అదే సమయంలో సమాంతరంగా శతావధాని శ్రీమాన్ కృష్ణమాచార్యుల సహోదరులు శ్రీ వేంకటేశ్వర చెంపూ ప్రబంధాది అనేక గ్రంథాలను రచించిన అష్టావధాని శ్రీమాన్ శిరిశినహల్ పెరుమాండ్లాచార్యుల వద్ద సంస్కృతంలో పంచ కావ్యాలు నైషధాంతం శ్రద్ధాభక్తులతో అభ్యసించారు. స్మార్త, ఆగమ పండితులు నిత్య పూజా దురంధరులు పితామహులైన శ్రీ గుడి కృష్ణమూర్తి శాస్త్రి గారి దగ్గర పూజాది కార్యక్రమాలకు సంబంధించిన అన్ని విషయాలను అభ్యసించారు. నిర్మల్ డిగ్రీ కళాశాలలో బి.ఎస్.సి. (ఎం.పి.సి) పూర్తి చేసి తదనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఎస్.సి. (అప్లయిడ్ మేథమేటికల్ స్టాటిస్టిక్స్) పూర్తి చేశారు. 19 సం॥ల వయసులోనే పంచాంగ గణితాన్ని ప్రారంభించి మొదటి రెండేండ్లు తండ్రి పర్యవేక్షణ సహాయ సహకారాలతో పూర్తిచేసి తదనంతరం స్వయంగా 42 సంవత్సరాల నుంచి నిర్విఘ్నంగా పంచాంగ రచన చేస్తూ సంప్రదించిన వారందరికీ జాతక, జ్యోతిశ్శాస్త్ర, ప్రశ్న, ముహూర్త, వాస్తు విషయ నిర్ణయం తెలియజేస్తూ అనేక మంది మన్ననలను పొందుతున్నారు.